# జాక్‌పాట్ ఎవరిదో ?

**పంత్‌పైనే ఫ్రాంచైజీల దృష్టి • నేడు, రేపు ఐపీఎల్ మెగా వేలం**



జెడ్డా(సౌదీ అరేబియా): క్రికెటర్ల తలరాత మారే సమయం రానే వచ్చింది. ఐపీఎల్ మెగావేలానికి మరో కొద్ది గంటల్లో తెర లేవనుంది. రానున్న సీజన్ కోసం ప్లేయర్లను ఎంపిక చేసుకునేందుకు ఫ్రాంచైజీలు పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యాయి. రెండు(ఆది, సోమ) రోజుల్లో జరిగే ఐపీఎల్ వేలంలో జాక్‌పాట్ కొట్టేదెవరో తేలనుంది. ఇప్పటికే ఫ్రాంచైజీలు కీలక ప్లేయర్లను అట్టిపెట్టుకోగా, చాలా మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. మొత్తం 577 మంది ప్లేయర్లు వేలంలో పోటీపడుతున్నారు. ఇందులో ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ కెప్టెన్ రిషబ్ పంత్‌పై అందరి కండ్లు ఉన్నాయి. పంత్‌ను రికార్డు స్థాయిలో తమ వశం చేసుకునేందు కు ఫ్రాంచైజీలు కాచుకు కూర్చున్నాయి. గత కొన్నేండ్లుగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఢిల్లీ నుంచి బయటికి వచ్చిన పంత్ 25 కోట్లకు పైగా అమ్ముడుపోయే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. పంత్‌కు తోడు వేలంలోకి వచ్చిన కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్‌సింగ్, బట్లర్, సిరాజ్, రబాడ, సాల్ట్, స్టార్క్, లివింగ్‌స్టోన్ లాంటి టీ20 స్టార్లపై ఫ్రాంచైజీలు కన్నేశాయి. అన్ని ఫ్రాంచైజీల వద్ద 641 కోట్లు ఉన్నాయి. ఇందులో అందరికంటే ఎక్కువగా పంజాబ్(110), ఆర్‌సీబీ(83), ఢిల్లీ(73) టాప్-3లో ఉన్నాయి.

# తిలక్ హ్యాట్రిక్ ధమాకా

**టీ20ల్లో వరుసగా మూడో సెంచరీ • హైదరాబాదీ వర్మ అరుదైన రికార్డు**



ముంబై: హైదరాబాద్ యువ క్రికెటర్ ఠాకూర్ తిలక్‌వర్మ రికార్డులు దాసోహం అవుతున్నాయి. టీ20ల్లో దుమ్మురేపుతున్న వర్మ.. తాజాగా సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో భాగంగా మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో విశ్వరూపం ప్రదర్శించాడు. దక్షిణాఫ్రికాతో రెండు సెంచరీల జోరును కొనసాగిస్తూ శనివారం మేఘాలయతో మ్యాచ్‌లోనూ వర్మ(67 బంతుల్లో 151, 14ఫోర్లు, 10సిక్స్‌లు) విజృంభించాడు. ఈ క్రమంలో టీ20ల్లో వరుసగా మూడు సెంచరీలు చేసిన తొలి బ్యాటర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. దీనికి తోడు పొట్టి ఫార్మాట్‌లో 150 పరుగుల మార్క్ అందుకున్న మొదటి క్రికెటర్‌గాను ఘనత సాధించాడు. తిలక్‌కు తోడు తన్మయ్(55) రాణించడంతో హైదరాబాద్ 20 ఓవర్లలో 248/4 స్కోరు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనలో అనికేత్‌రెడ్డి, తనయ్ ధాటికి మేఘాలయ 15.1 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూలింది. దీంతో హైదరాబాద్ 179 పరుగుల తేడాతో గెలిచింది.

# సాత్విక్ జోడీ నిష్క్రమణ

**చైనా మాస్టర్స్ టోర్నీ**



షెన్‌జెన్(చైనా): చైనా మాస్టర్స్ టోర్నీలో భారత బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి పోరాటం ముగిసింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్, చిరాగ్ జోడీ 18-21, 21-14, 16-21తో అన్‌సీడెడ్ కొరియా జంట జిన్ యంగ్, సియో సంగ్‌జీ చేతిలో ఓటమి పాలైంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత తొలిసారి బరిలోకి దిగిన టోర్నీలో మాజీ ప్రపంచ నంబర్‌వన్ జోడీ ఆకట్టుకోలేకపోయింది. తొలి గేమ్‌ను చేజార్చుకున్న సాత్విక్, చిరాగ్ పుంజుకుని రెండో గేమ్‌ను దక్కించుకున్నారు. మూడో గేమ్‌లో పోటీనివ్వలేకపోయారు.

# పట్టు దొరికే

**బుమ్రా పాంచ్ పటాకా | ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 104 ఆలౌట్**

**భారీ ఆధిక్యం దిశగా భారత్**

**జైస్వాల్, రాహుల్ విజృంభణ**



జైస్వాల్ (90 నాటౌట్)

**బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ)లో భారత్, ఆస్ట్రేలియా మధ్య పెర్త్‌లో రసవత్తర పోరు సాగుతున్నది. పేస్‌కు స్వర్గధామమైన పిచ్‌పై వికెట్ల వేట ముగియగా, పరుగుల వరద మొదలైంది. భారత బౌలింగ్ ధాటికి కంగారూలు కుదేలైన మ్యాచ్‌లో ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రాహుల్ అజేయ అర్ధసెంచరీలతో కదంతొక్కారు. ఆసీస్ బౌలింగ్ దాడిని అంతే దీటుగా తిప్పికొడుతూ భారత్‌ను భారీ ఆధిక్యం దిశగా తీసుకెళుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో నిరాశపరిచిన జైస్వాల్.. కంగారూ బౌలర్లను ఓ ఆటాడుకున్నాడు. ఆసీస్ గడ్డపై ఆడుతున్నది తొలిసారే అయినా తొణుకు బెణుకు లేకుండా అలవోకగా పరుగులు కొల్లగొడుతున్నాడు. మూడో రోజు ఇదే జోరు కొనసాగిస్తే ఆసీస్ ముందు భారీ లక్ష్యం నిర్దేశించినట్లే. కెప్టెన్ బుమ్రా పాంచ్ పాటాకాతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులకే కుప్పకూలింది. స్టార్క్ సతాయించినా..ఆసీస్ ఆటలు కొనసాగలేదు.**

పెర్త్: భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు ఊహించని మలుపులతో కొనసాగుతున్నది. పేస్ బౌలింగ్‌కు అచ్చొచ్చిన పెర్త్ పిచ్ అనూహ్యంగా స్పందిస్తున్నది. తొలి రోజు ఇరు జట్ల పేసర్లు 17 వికెట్లతో పండుగా చేసుకుంటే రెండో రోజు ఆట అందుకు భిన్నంగా సాగింది. కేవలం మూడంటే మూడు వికెట్లు పడగా, 209 పరుగులు వచ్చాయి. మరీ మూడు రోజులు మిగిలున్న టెస్టులో బంతి ఎలా స్పందిస్తునేది ఆసక్తికరంగా మారింది. 46 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియా ఆట ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 172 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(193 బంతుల్లో 90 నాటౌట్, 7ఫోర్లు, 2సిక్స్‌లు), కేఎల్ రాహుల్(153 బంతుల్లో 62 నాటౌట్, 4ఫోర్లు) అజేయ అర్ధసెంచరీలతో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయిన ఈ ఇద్దరు ఆసీస్ బౌలింగ్ దాడిని ఎదురొడ్డి నిలుస్తూ పరుగులు సాధించారు. చేతిలో 10 వికెట్లు ఉన్న టీమ్‌ఇండియా ప్రస్తుతం 218 పరుగుల కీలక ఆధిక్యంలో కొనసాగుతున్నది. 300 నుంచి 400ల మధ్య ఆసీస్ ముందు లక్ష్యాన్ని ఉంచితే మ్యాచ్‌పై మనం పూర్తి పట్టు సాధించినట్లే. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 67/7తో రెండో రోజు ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్..104 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్ స్టార్క్(112 బంతుల్లో 26, 2ఫోర్లు) భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. క్యారీ(21), లియాన్(5), హేజిల్‌వుడ్(7 నాటౌట్) కలిసి క్రీజులో అతుక్కుపోయాడు. ఏకంగా 18 ఓవర్ల పాటు టీమ్‌ఇండియా బౌలర్లకు పరీక్ష పెట్టాడు. కెప్టెన్ బుమ్రా(5/30) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ పతనంలో కీలకమయ్యాడు.

**బుమ్రా పాంచ్ పటాకా:**

రెండో రోజు ఆటలోనూ బుమ్రా తన పేస్ ప్రతాపాన్ని కొనసాగించాడు. ఆదిలోనే క్యారీని ఔట్ చేసిన బుమ్రా..ఆసీస్‌ను కోలుకోనివ్వలేదు. అయితే మరో ఎండ్‌లో స్టార్క్ అడ్డుగోడగా నిలిచాడు. లోయార్డర్ బ్యాటర్లతో కలిసి టీమ్‌ఇండియా బౌలర్లకు పరీక్ష పెట్టాడు.

## జైస్వాల్, రాహుల్ అదుర్స్



రాహుల్ (62 నాటౌట్)

తొలి ఇన్నింగ్స్‌లో తడబడ్డ జైస్వాల్ మలి ఇన్నింగ్స్‌లో చెలరేగగా, రాహుల్ తన అనుభవాన్ని చాటాడు. వీరిద్దరు ఎక్కడా తడబాటుకు లోనుకాకుండా ఆసీస్ బౌలింగ్ దాడిని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఆసీస్ గడ్డపై తొలి టెస్టు ఆడుతున్న ముంబైకర్ జైస్వాల్ మెరుగైన పరిణతి కనబరిచాడు. ఓవైపు మంచి బంతులను గౌరవిస్తూనే కళాత్మక షాట్లతో అలరించాడు. సంప్రదాయక టెస్టు క్రికెట్ షాట్లకు పెద్దపీట వేస్తూ ఇన్నింగ్స్ కొనసాగించాడు. ఈ క్రమంలో జైస్వాల్ పెర్త్ టెస్టులో భారత్ భారీ ఆధిక్యానికి పునాదులు వేశాడు. ఈ క్రమంలో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు(34) రికార్డుతో పాటు రాహుల్‌తో కలిసి అజేయ భాగస్వామ్యం నెలకొల్పాడు. ఒకానొక దశలో ఆసీస్ బౌలర్లను వీరిని విడగొట్టేందుకు చేసిన ప్రయత్నాలు అన్నీ విఫలమయ్యాయి. ప్రధాన పేస్ అస్త్రం స్టార్క్‌ను ఓ వైపు కవ్వించిన జైస్వాల్..లియాన్‌ను అంతే అలవోకగా అరుసుకున్నాడు. లియాన్ బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో జైస్వాల్ కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. ఒక దశలో జైస్వాల్ ఆట చూసి స్టార్క్ ఆశ్చర్యపోయాడు. మరో ఎండ్‌లో రాహుల్ అనుభవంతో ఇన్నింగ్స్‌ను తీర్చిదిద్దాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బంతులను అంతే జాగ్రత్తగా వదిలిపెట్టిన రాహుల్ సూపర్ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో తన ఎంపిక కరెక్ట్ అనే టీమ్ మేనేజ్‌మెంట్‌కు సంకేతాలు పంపాడు. ఇలా ఇద్దరు పోటీపడి క్రీజులో కుదురుకోవడంతో కంగారూ బౌలర్ల ఆటలు సాగలేదు. ముఖ్యంగా టీ సెషన్ తర్వాత జైస్వాల్, రాహుల్ కలిసి 31 ఓవర్లలో 88 పరుగులు చేసి తమ డిఫెన్స్ ఎలా ఉందో చూపెట్టారు.

### క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు

| | |
|---|---|
| జైస్వాల్ | (34)-2024 |
| మెక్‌కల్లమ్ | (33)-2014 |
| స్టోక్స్ | (26)-2022 |

**2** **పెర్త్‌లో భారత్‌పై ఆస్ట్రేలియాకు ఇదే రెండో అత్యల్ప స్కోరు(104). 1981లో ఆసీస్ 83 పరుగులకు ఆలౌటైంది.**

**ఆసియా బయట టెస్టుల్లో ఐదేసి వికెట్లు తీయడం బుమ్రాకు ఇది 9వ సారి. కపిల్‌దేవ్ సరసన బుమ్రా నిలిచాడు.** **9**

### సంక్షిప్త స్కోర్లు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 150 ఆలౌట్, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 104 ఆలౌట్(స్టార్క్ 26, క్యారీ 21, బుమ్రా 5/30, రానా 3/48), **భారత్ రెండో ఇన్నింగ్స్:** 172/0 (జైస్వాల్ 90 నాటౌట్, రాహుల్ 62 నాటౌట్)



## ఐటీఎఫ్ చాంప్ రిశిత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గువాహటి(అస్సాం) వేదికగా జరిగిన ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్ టోర్నీలో రాష్ర్టానికి చెందిన బాసిరెడ్డి రిశితారెడ్డి విజేతగా నిలిచింది. శనివారం జరిగిన బాలికల జే60 విభాగం సింగిల్స్ ఫైనల్లో రిశిత 7-5, 6-4తో ప్రియాంక రానా(అమెరికా)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన ఆధిపత్యం ప్రదర్శించిన రిశిత వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది. టోర్నీ మొత్తం ఈ యువ టెన్నిస్ ప్లేయర్ కనీసం ఒక్క సెట్ కూడా ఓడిపోకపోవడం విశేషం. ఐటీఎఫ్ జూనియర్ కేటగిరీలో ప్రస్తుతం రిశిత 252వ ర్యాంక్‌లో కొనసాగుతున్నది.



## ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ విజేత ప్రదీప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రష్యాలో జరుగుతున్న ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన పెరుమాళ్ల ప్రదీప్‌కుమార్ సత్తాచాటాడు. పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్(డబ్ల్యూఫ్) నిర్వహిస్తున్న పోటీల్లో మూడు విభాగాల్లో ప్రదీప్ మొదటి స్థానాల్లో నిలిచి పతకాలు కైవసం చేసుకున్నాడు. 62-64 ఏండ్ల వయసు విభాగంలో బరిలోకి దిగిన ప్రదీప్..డెడ్‌లిఫ్ట్‌లో 160కిలోలు, ఓవరాల్‌గా 390 కిలోల బరువెత్తి రెండు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు. రష్యాలో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్ తరపున నలుగురు లిఫ్టర్లు పోటీపడ్డారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.